


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



శనివారం 06-06-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :1 | సంచిక : 355 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## బీఆర్ఎస్ హయాంలో
# కమీషన్ల దోపిడీ



- ఒక్క ఎకరాకూ నీళ్లు ఇవ్వలేదు: కేసీఆర్‌పై సీఎం తీవ్ర విమర్శలు
- పాలమూరు ప్రాజెక్టులపై గత ప్రభుత్వంపై రేవంత్ ధ్వజం
- ప్రాజెక్టుల పేరుతో వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపణ
- పాలమూరు అభివృద్ధికి యుద్ధ ప్రాతిపదికన పనులు: సీఎం
- కాళేశ్వరం కూలాక నీటి నిర్వహణలో మార్పులు: రేవంత్
- భూసేకరణ లేకపోవడమే ప్రాజెక్టుల ఆలస్యానికి కారణం: సీఎం
- బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలకు విలువ లేదని సీఎం వ్యాఖ్య

**మహబూబ్ నగర్ ,జూన్ 5 (ఇది కద నిజం ):**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. రెండో రోజు పర్యటనలో భాగంగా పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కల్వకుర్తి ప్రాజెక్టు పనులను ఆయన ప్రత్యక్షంగా చూశారు. అనంతరం కరివెన రిజర్వాయర్ వద్ద మీడియాతో మాట్లాడారు.

ఈ సందర్భంగా ఆయన గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రాజెక్టుల పేరుతో పెద్ద మొత్తంలో నిధులు ఖర్చయినా, భూసేకరణ, పూర్తిస్థాయి పనులు జరగలేదని ఆయన ఆరోపించారు. కోట్లాది రూపాయల ఖర్చు జరిగినా రైతులకు నీరు చేరలేదని ఆయన వ్యాఖ్యానించారు.

పాలమూరు జిల్లాలో జూరాల మినహా ఇతర ప్రధాన ప్రాజెక్టులు పూర్తికాలేదని సీఎం పేర్కొన్నారు. గత పాలనలో ప్రాజెక్టుల పురోగతిపై అవాస్తవాలు చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టించారని ఆయన విమర్శించారు. ఎత్తిపోతల పథకాల పనుల్లో అవినీతి జరిగిందని, దీనిపై అప్పట్లోనే మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి నిరంతరం ప్రశ్నించారని ఆయన గుర్తు చేశారు.

కే . చంద్రశేఖర్ రావు నేతృత్వంలోని గత ప్రభుత్వం పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయకుండా నిధులను వృథా చేసిందని ఆయన ఆరోపించారు. ప్రాజెక్టు కోసం భారీ అంచనాలు వేసినా, సగం పనులు మాత్రమే పూర్తయ్యాయని, అందువల్ల ఆశించిన స్థాయిలో ఆయకట్టు అభివృద్ధి జరగలేదని చెప్పారు.

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వేల కోట్ల రూపాయలు కేటాయించి పెండింగ్ పనులను వేగవంతం చేస్తున్నామని సీఎం తెలిపారు. భూసేకరణ సమస్యలు, పునరావాస చర్యలు పూర్తిచేసిన తర్వాతే రిజర్వాయర్లను నింపడం సాధ్యమని ఆయన స్పష్టం చేశారు.

రెండేళ్లలో ప్రాజెక్టులను పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని, అవసరమైతే భూసేకరణకు అదనపు నిధులు కూడా మంజూరు చేస్తామని ఆయన అన్నారు. కర్ణాటకతో సమన్వయం చేసుకుని నీటి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.

బీఆర్ఎస్ నేతల విమర్శలను ఆయన తోసిపుచ్చారు. రాజకీయ వ్యాఖ్యలకు విలువ లేదని, అభివృద్ధి పనులను అడ్డుకోవద్దని ఆయన సూచించారు. గత పాలనలో ప్రారంభమైన అనేక ప్రాజెక్టులు నిలిచిపోయాయని, వాటిని పూర్తిచేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు.

మొత్తానికి పాలమూరు ప్రాంత ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే తమ ప్రాధాన్యమని ఆయన పునరుద్ఘాటించారు.

## తెలంగాణ జల హక్కులను కాపాడటంలో
# సర్కార్ విఫలం

- జల హక్కులపై ప్రభుత్వంపై బీఆర్ఎస్ విమర్శలు
- కృష్ణా జలాల వాటా తగ్గిందని ఆరోపణ
- సాగునీటి ప్రాజెక్టులపై హరీశ్ రావు లేఖ
- కాంగ్రెస్ నిర్లక్ష్యంపై తీవ్ర వ్యాఖ్యలు
- జల వనరుల పరిరక్షణకు డిమాండ్



హైదరాబాద్, జూన్ 5: తెలంగాణ జల హక్కుల పరిరక్షణలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రాష్ట్ర జల వనరులు ప్రమాదంలో పడ్డాయని లేఖలో పేర్కొన్నారు. ఎత్తిపోతల పథకాల నిర్వహణపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు.

# 'లిక్కర్ స్కామ్ లేదు.. అంతా కక్షే'

## కూటమి ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు.. మద్యం విధానాలు, నకిలీ మద్యం అంశాలపై విమర్శలు



అమరావతి, జూన్ 5: కూటమి ప్రభుత్వంపై మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ఉనికిలోనే లేని 'లిక్కర్ స్కామ్' పేరుతో ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుని రాజకీయ కక్ష సాధింపులు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిపక్ష నేతలను వేధించడమే ప్రధాన లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన మండిపడ్డారు. మొదట రూ.30 వేల కోట్ల స్కామ్ అని, తర్వాత రూ.3 వేల కోట్లకు తగ్గించడం ద్వారా ఆరోపణల్లోనే స్పష్టత లేకుండా ఉందని వ్యాఖ్యానించారు.

## రాష్ట్ర పురోగతికి
# 'డబుల్ ఇంజిన్' పాలన అవసరం



- తెలంగాణ పురోగతికి కేంద్ర-రాష్ట్ర సమన్వయం కీలకం
- ప్రజల విశ్వాసం బీజేపీ వైపే
- అభివృద్ధి, సంక్షేమంలో సమన్వయమే లక్ష్యం: రాంచందర్‌రావు

హైదరాబాద్, జూన్ 5: రాష్ట్ర అభివృద్ధి వేగవంతం కావాలంటే కేంద్రం, రాష్ట్రంలో ఒకే విధానంతో పనిచేసే ప్రభుత్వాలు అవసరమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రజల్లో బీజేపీ పట్ల విశ్వాసం పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు.

శుక్రవారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నిధుల వినియోగం, ఉద్యోగ నియామకాలు, సాగునీటి రంగాల్లో అనేక లోపాలు చోటు చేసుకున్నాయని విమర్శించారు.

## ప్రకృతి పరిరక్షణలో ప్రతి పౌరుడూ
# భాగస్వామి కావాలి



సిద్దిపేట, జూన్ 5: పర్యావరణ పరిరక్షణను ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేట జిల్లా కొండపాక మండలంలోని మర్పడగ గ్రామ అర్బన్ ఆక్సిజన్ పార్క్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మొక్కలు నాటి, పర్యావరణ అవగాహనకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం హాజరైన వారితో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు.

# రూ.1600 కోట్ల బొగ్గు కుంభకోణం

## : కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి కేటీఆర్ లేఖ

- 40 లక్షల టన్నుల బొగ్గు గల్లంతు
- సింగరేణి బొగ్గు స్కాంపై సిట్టింగ్ జడ్జి విచారణకు డిమాండ్
- కాంగ్రెస్ ప్రభుత్వంలో సింగరేణి కుంభకోణాలు పెరిగాయని కేటీఆర్ ఆరోపణలు



**జూన్ 5 ,ఇది కద నిజం :**

సింగరేణిలో జరిగిన రూ.1600 కోట్ల కుంభకోణంపై విచారణ జరపాలని కేంద్ర బొగ్గుగనుల శాఖమంత్రి కిషన్ రెడ్డికి కేటీఆర్ లేఖ రాశారు. సింగరేణి నిల్వల నుంచి సీఎం రేవంత్ రెడ్డి రూ.1600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గును మాయం చేశారని, స్టాక్ యార్డుల్లో ఉండాల్సిన బొగ్గును అప్పనంగా అమ్ముకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక సింగరేణి వరుస కుంభకోణాలకు కేరాఫ్ అడ్రస్ గా మారిందని విమర్శించారు.

## కొత్త రాజకీయ ఉద్యమానికి
# అన్నామలై శ్రీకారం



చెన్నై, జూన్ 5: తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కే. అన్నామలై పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. అదే సమయంలో రాష్ట్రంలో కొత్త రాజకీయ ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

తన నిర్ణయానికి కారణంగా పార్టీ కేంద్ర నాయకత్వంతో ఏర్పడిన వ్యూహాత్మక అభిప్రాయ భేదాలను ఆయన ప్రస్తావించారు. రాష్ట్ర రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా పార్టీ ముందుకు సాగాల్సిన దిశపై తన అభిప్రాయాలు, పార్టీ నాయకత్వ ఆలోచనల మధ్య భిన్నతలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ అంశాలపై కొంతకాలంగా చర్చలు జరిగినప్పటికీ ఆశించిన స్థాయిలో ఏకాభిప్రాయం కుదరలేదని తెలిపారు.

## ఏపీ అభివృద్ధి చెందితే
# భారత్ అభివృద్ధి చెందుతుంది

- బ్లూ ఎకానమీపై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు
- సీ-ఫుడ్ రంగంలో ఏపీకి రెండో స్థానం
- విశాఖ వర్క్‌షాప్‌లో అభివృద్ధి దిశపై చర్చ
- సముద్ర ఆర్థిక వ్యవస్థే భవిష్యత్: సీఎం
- ఏపీ ఎగుమతులపై కీలక గణాంకాలు వెల్లడి



**విశాఖపట్నం, జూన్ 5(ఇది కద నిజం) :**

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధిస్తే దేశ అభివృద్ధికి కూడా అదే స్థాయిలో ఊతం లభిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. బ్లూ ఎకానమీని సమర్థంగా వినియోగించుకుంటే భారత ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

విశాఖలో నిర్వహించిన సీ-ఫుడ్ ఎగుమతుల జాతీయ వర్క్‌షాప్‌ను ముఖ్యమంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో సముద్ర ఆహార ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.

భారతదేశ సీ-ఫుడ్ ఉత్పత్తిలో రాష్ట్రం రెండో స్థానంలో ఉందని, ఏటా సుమారు 197 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరుగుతోందని వివరించారు.

## పాలన చేతకాకపోతే
# రాజీనామా చేయాలి

- ధాన్యం కొనుగోళ్లలో వైఫల్యం రాష్ట్ర ప్రభుత్వానిదే
- రైతుల సమస్యలపై రాజకీయాలు తగవు
- కేంద్రంపై నెపం మోపడం సరికాదు

: ధర్మపురి అరవింద్



Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శనివారం 06-06-2026

# కొత్త రాజకీయ ఉద్యమానికి అన్నామలై శ్రీకారం

మొదటి పేజీ తరువాయి

పార్టీతో అనుబంధం ముగిసినప్పటికీ ప్రధాని నరేంద్ర మోదీ సహా జాతీయ నాయకత్వంపై తన గౌరవం కొనసాగుతుందని అన్నామలై చెప్పారు. రాజకీయ జీవితంలో లభించిన అవకాశాలకు కృతజ్ఞతలు తెలుపుతూ, విభేదాల నేపథ్యంలో గౌరవప్రదంగా తప్పుకోవడమే సముచితమని భావించినట్లు వివరించారు.

రాజీనామా అనంతరం తన భవిష్యత్ కార్యాచరణపై స్పందించిన ఆయన, తమిళనాడులో ప్రజల సమస్యలను కేంద్రంగా చేసుకుని కొత్త రాజకీయ వేదికను నిర్మించనున్నట్లు వెల్లడించారు. వ్యక్తి ఆధారిత రాజకీయాల కంటే ప్రజా భాగస్వామ్యానికి ప్రాధాన్యం ఇచ్చే ప్రత్యామ్నాయ రాజకీయ సంస్కృతిని తీసుకురావడమే లక్ష్యమని పేర్కొన్నారు.

భవిష్యత్తులో ఎన్నికల రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటానని, రాష్ట్ర రాజకీయాల్లో కొత్త దిశను ప్రతిపాదించేందుకు కృషి చేస్తానని అన్నామలై తెలిపారు. ఆయన నిర్ణయం తమిళనాడు రాజకీయాల్లో కొత్త చర్చలకు దారితీసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# రాష్ట్ర పురోగతికి 'డబుల్ ఇంజిన్' పాలన అవసరం

మొదటి పేజీ తరువాయి

ప్రస్తుత ప్రభుత్వ పాలనలో కూడా అవినీతి, పరిపాలనా నిర్లక్ష్యం కనిపిస్తున్నాయని ఆరోపించారు.

రైతు రుణమాఫీ వంటి కీలక హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆయన అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమర్థవంతమైన సమన్వయం అవసరమని పేర్కొన్నారు.

దేశం గత దశాబ్ద కాలంగా సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమతుల్యంగా ముందుకు తీసుకెళ్తోందని రాంచందర్‌రావు తెలిపారు. పార్టీ కార్యకర్తలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియా వంటి ఆధునిక సాంకేతిక వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. అదే సమయంలో ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

శిక్షణా శిబిరాల్లో చర్చించిన అంశాలను ప్రజలకు సులభంగా వివరించాలని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు మరియు పార్టీ విధానాలను గ్రామస్థాయికి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు.

# ప్రకృతి పరిరక్షణలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలి

మొదటి పేజీ తరువాయి

మాట్లాడిన ఆయన, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ఇప్పటి నుంచే పచ్చదనాన్ని పెంపొందించే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

రాష్ట్రంలో కాలుష్య నియంత్రణకు అనుకూలంగా పర్యావరణహిత విధానాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. మొక్కల పెంపకం ప్రతి కుటుంబం, ప్రతి గ్రామం బాధ్యతగా మారాలని సూచించారు. రాష్ట్రంలో నిర్మించనున్న ఇందిరమ్మ గృహాలు, ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో విస్తృతంగా మొక్కలు నాటేలా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.

గ్రామాల్లో మొక్కల సంరక్షణ కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశామని, స్థానిక అవసరాలకు అనుగుణంగా పండ్ల మొక్కల పెంపకానికి ప్రోత్సాహం అందిస్తున్నామని చెప్పారు. పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛత కార్యక్రమాల్లో విశేష కృషి చేస్తున్న గ్రామపంచాయతీలు, మహిళా సంఘాలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

ప్రకృతి సంపదను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పచ్చదనం పెంపుతోనే స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక అడుగు

## సిట్ ముందు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విచారణ.. దర్యాప్తు వేగవంతం



హైదరాబాద్, జూన్ 5: తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు కీలక దశకు చేరుకుంది. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణను వేగవంతం చేస్తోంది.

ఈ కేసులో భాగంగా భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సిట్ అధికారుల ఎదుట హాజరుకానున్నారు. శనివారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు రావాలని ఆయనకు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పలువురు కాంగ్రెస్ నేతల ఫోన్లు ట్యాప్ అయినట్లు సిట్ దర్యాప్తులో గుర్తించిన నేపథ్యంలో, ఎంపీ ఫోన్ కూడా ట్యాపింగ్‌కు గురైనట్లు అధికారులు నిర్ధారించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేయడానికి అధికారులు సిద్ధమయ్యారు.

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ విజయానికి కీలక పాత్ర పోషించిన చామల కిరణ్ కుమార్ రెడ్డి, అనంతరం 2024 లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు.

ఇదిలా ఉండగా, ఫోన్ ట్యాపింగ్ కేసులో ఈ నెలలోనే ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలని సిట్ కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే పలువురు బాధితుల వాంగ్మూలాలను నమోదు చేస్తూ దర్యాప్తును మరింత వేగవంతం చేసినట్లు తెలుస్తోంది.

# గాంధీ ఆస్పత్రిలో రెండుకు చేరిన ఎబోలా అనుమానితులు




సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో ఎబోలా వ్యాధి అనుమానిత కేసుల సంఖ్య రెండుకు చేరింది. వ్యాధి లక్షణాలతో సూడాన్‌కు చెందిన మహమ్మద్ యగౌచ్ అహ్మద్ శుక్రవారం ఆస్పత్రిలో చేరాడు. గురువారం శంషాబాద్ విమానాశ్రయంలో నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్షల్లో అహ్మద్(36) అనే సూడాన్ దేశస్థుడికి ఎబోలా వైరస్ లక్షణాలు ఉన్నట్లు వైద్యాధికారులు గుర్తించారు. ఎబోలా లక్షణాలున్న ఇద్దరూ సూడాన్ నుంచే వచ్చినట్టు వైద్యులు తెలిపారు. మహమ్మద్ నగరంలోని ఓ ఇన్‌స్టిట్యూట్‌లో చదువుతున్నట్లు సమాచారం. ఎబోలా లక్షణాలున్న వ్యక్తితో క్లోజ్ కాంటాక్ట్‌లో ఉన్న మరో వ్యక్తిని కూడా గాంధీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఐసోలేషన్ వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నారు.

మధ్య ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వైరస్ ప్రబలుతున్న నేపథ్యంలో అక్కడి నుంచి వచ్చే ప్రయాణికులకు శంషాబాద్ విమానాశ్రయంలోనే స్క్రీనింగ్ నిర్వహిస్తున్నారు. నగరానికి మోకీళ్ల చికిత్స కోసం వచ్చిన అహ్మద్ తీవ్ర జ్వరంతో బాధపడుతున్నారని, అతన్ని ఎబోలా ఐసోలేషన్ వార్డులో ఉంచామని గాంధీలోని ఎబోలా నోడల్ అధికారి డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. అతని శాంపిళ్లు తీసుకొని పరీక్షల కోసం సీసీఎంబీకి, అక్కడి నుంచి పుణెలోని జాతీయ వైరాలజీ ల్యాబ్‌కు పంపామని, వారంరోజుల్లో నివేదికలు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. గాంధీలో 20 పడకలతో ఐసోలేషన్ వార్డును ఏర్పాటు చేశామన్నారు.

# పాలన చేతకాకపోతే రాజీనామా చేయాలి

హైదరాబాద్, జూన్ 5: ధాన్యం కొనుగోళ్ల వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో వ్యవహరించడంలో విఫలమైందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ విమర్శించారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం రాజకీయ ఆరోపణలకు ప్రాధాన్యం ఇవ్వడం సమంజసం కాదని పేర్కొన్నారు.

శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఏర్పడిన సమస్యలకు కేంద్ర ప్రభుత్వాన్ని బాధ్యురాలిగా చూపడం సరైన విధానం కాదన్నారు. పంట కోతల సీజన్‌కు ముందుగానే కొనుగోలు కేంద్రాలు, రవాణా ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని తెలిపారు.

రైతుల ధాన్యం తరలింపులో ఇబ్బందులు తలెత్తడం పరిపాలనా లోపాలకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. రైతుల ఉత్పత్తిని గౌరవించే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిపోయి, వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు.

రాష్ట్రంలో పంట ఉత్పత్తిపై ముందస్తు అంచనాలు రూపొందించి తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అరవింద్ పేర్కొన్నారు. అలాగే నగరాభివృద్ధి, గ్రామీణ మౌలిక వసతులు, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలపై ప్రభుత్వం మరింత దృష్టి సారించాలని సూచించారు.

ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీల అమలు, రాష్ట్ర ప్రయోజనాల సాధన కోసం తీసుకున్న చర్యలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

# 'లిక్కర్ స్కామ్ లేదు.. అంతా కక్షే': అంబటి రాంబాబు

మొదటి పేజీ తరువాయి

అసలు అవినీతి ఎక్కడ జరిగిందో ఇప్పటివరకు చూపలేకపోయారని విమర్శించారు.

ప్రభుత్వ చర్యలపై స్పందించిన ఆయన, వివిధ స్థాయిల్లో ఉన్న ఉద్యోగులకు కూడా నోటీసులు జారీ చేయడం ద్వారా భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈ విధానం కొనసాగితే భవిష్యత్తులో మరింత చిన్నస్థాయి ఉద్యోగులకూ నోటీసులు ఇవ్వాల్సి వస్తుందేమోనని వ్యాఖ్యానించారు.

మద్యం విధానంలో మార్పుల ద్వారా భారీ అవినీతి జరుగుతోందని అంబటి రాంబాబు ఆరోపించారు. గతంలో ప్రభుత్వ ఆధీనంలో ఉన్న మద్యం విక్రయ వ్యవస్థను ప్రైవేటీకరించడం వల్ల సిండికేట్లు పెరిగి అక్రమ వసూళ్లు జరుగుతున్నాయని తెలిపారు. ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ వసూళ్లు జరుగుతున్నాయని, ఈ డబ్బు పెద్ద రాజకీయ నాయకుల వరకు చేరుతోందని ఆరోపించారు.

రాష్ట్రంలో నకిలీ మద్యం సమస్య తీవ్రంగా ఉందని, మార్కెట్లో అమ్ముడవుతున్న సీసాల్లో గణనీయమైన భాగం నకిలీదేనని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో అధికార పార్టీ నేతల పాత్ర ఉందని ఆరోపిస్తూ, ములకలచెరువు కేసులో స్పష్టమైన ఆధారాలు ఉన్నప్పటికీ చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

నకిలీ మద్యం కేసుల దర్యాప్తు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ద్వారా నిజాలను పక్కదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. ప్రజా సమస్యలను పక్కన పెట్టి రాజకీయ ప్రయోజనాల కోసం ప్రభుత్వ వ్యవస్థలను ఉపయోగిస్తున్నారని అంబటి రాంబాబు తీవ్రంగా విమర్శించారు.

# ఏపీ అభివృద్ధి చెందితే భారత్ అభివృద్ధి చెందుతుంది

మొదటి పేజీ తరువాయి

దేశ మొత్తం చేపల ఉత్పత్తిలో ఏపీ వాటా 28 శాతం కాగా, రొయ్యల ఉత్పత్తిలో 66 శాతం ఉందని చెప్పారు. సముద్ర ఆహార ఎగుమతుల ద్వారా దేశానికి గణనీయమైన ఆదాయం లభిస్తోందని పేర్కొన్నారు.

ప్రపంచ సీ–ఫుడ్ వ్యాపారంలో భారత్ వాటా ప్రస్తుతం తక్కువగా ఉన్నప్పటికీ, ఈ రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని సీఎం తెలిపారు. ఆక్వా రంగంలో సాంకేతిక ఆవిష్కరణలు, ఆధునిక విధానాలు అమలు చేస్తే ఎగుమతులు మరింత పెరుగుతాయని చెప్పారు.

కాకినాడ పోర్టు ఆధునికీకరణకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన స్వాగతించారు. కేంద్ర మత్స్యశాఖ ప్రాంతీయ కార్యాలయానికి అవసరమైన స్థలాన్ని త్వరలో అందిస్తామని హామీ ఇచ్చారు.

గోదావరి, కృష్ణ వంటి జీవనదులు రాష్ట్రానికి వరంగా ఉన్నాయని, నీటి వనరుల ఆధారంగా అభివృద్ధి అవకాశాలు మరింత విస్తరించవచ్చని సీఎం పేర్కొన్నారు. బ్లూ ఎకానమీ ద్వారా భవిష్యత్ ఆర్థిక వృద్ధికి బలమైన పునాది ఏర్పడుతుందని చంద్రబాబు నాయుడు తెలిపారు.

# తెలంగాణ జల హక్కులను కాపాడటంలో సర్కార్ విఫలం: హరీశ్ రావు

మొదటి పేజీ తరువాయి

దీంతో కాళేశ్వరం, దేవాదుల వంటి కీలక ప్రాజెక్టుల పనితీరు దెబ్బతిన్నదని పేర్కొన్నారు.

కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ వాటా గణనీయంగా తగ్గిందని హరీశ్ రావు లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఎక్కువ వాటా వినియోగిస్తుండగా, తెలంగాణ వాటా గణనీయంగా తగ్గిపోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

రైతులు, తాగునీటి అవసరాలు, పరిశ్రమల భవిష్యత్తు ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆరోపించారు. సోలార్ ఆధారిత విద్యుత్ విధానాలు సాగునీటి ప్రాజెక్టులకు ముప్పుగా మారుతున్నాయని పేర్కొంటూ, రైతు డిస్కం ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాల్సిన అవసరం ఉందని సూచించారు. అలాగే కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టులకు అవసరమైన నిధులు కేటాయించాలని లేఖలో కోరారు.

తెలంగాణ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని జల హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని హరీశ్ రావు విజ్ఞప్తి చేశారు.

# రూ.1600 కోట్ల బొగ్గు కుంభకోణం: కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి కేటీఆర్ లేఖ

మొదటి పేజీ తరువాయి

నైని కుంభకోణం మొదలుకొని.. వందల అక్రమాలు జరిగినా ఇంతవరకూ కేంద్రం ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. బొగ్గు నిల్వల్ని తనిఖీ చేసే సంబంధిత శాఖగానీ.. కాగ్ అధికారులు కానీ ఇప్పటి వరకూ ఎందుకు తనిఖీలు చేయలేదని నిలదీశారు. సింగరేణి బొగ్గు అంటే తెలంగాణ ప్రజల ఆస్తి అని, అలాంటి ఆస్తిని దోచుకుంటుంటే చూస్తూ ఊరుకోమని స్పష్టం చేశారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సింగరేణిని మనుగడనే దెబ్బతీస్తున్నాయని.. కిషన్ రెడ్డికి రేవంత్ రెడ్డితో మిలాఖత్ లేకుంటే వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. స్వయంగా కిషన్ రెడ్డే బొగ్గుగనుల శాఖ మంత్రిగా ఉండగా.. రాష్ట్రంలో ఇంత దుర్మార్గమైన కుంభకోణం జరగడం సిగ్గుచేటన్నారు. ఏప్రిల్ నెలాఖరు నాటికి మందమర్రిలో 7,20,00 మెట్రిక్ టన్నులు, శ్రీరాంపూర్ లో 8 లక్షల మెట్రిక్ టన్నులు, రామగుండం–1 లో ఆరు లక్షలు, రామగుండం–2 లో నాలుగు లక్షలు, భూపాలపల్లిలో 5 లక్షల 40 వేలు, ఇల్లందులో 3 లక్షల 50 వేలు, సత్తుపల్లిలో 2 లక్షల మెట్రిక్ టన్నులతోపాటు ఇతర వాటిని కలిపి సుమారు 40 లక్షల మెట్రిక్ టన్నుల స్టాక్ ఉందని లెక్కలు చూపించారు. కానీ కోల్ స్టాక్ పాయింట్ల దగ్గర ఆ బొగ్గు లేకపోవడమే ఈ కుంభకోణానికి అతిపెద్ద ఆధారమని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో కేంద్రం, రాష్ట్రం కలిసి లక్షల టన్నుల తెలంగాణ బొగ్గును పక్కదారి పట్టించాయా అనే బలమైన అనుమానం కార్మికలోకాన్ని వెంటాడుతోందన్నారు. ఈ స్కాంను దాచిపెట్టే కుట్రలు కొనసాగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఒక అఖిల పక్షాన్ని ఆయా గనుల వద్దకు పంపాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు.

అసలు బొగ్గు ఉత్పత్తి కోసం కోల్ ఇండియా పాటించే విధానాలేంటి? కాంగ్రెస్ హయాంలో సైట్ విజిట్ సర్టిఫికేట్ ను ఎవరి ప్రయోజనాలు ఆశించి పెట్టారు? చివరికి కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులను ఎలా పక్కదారి పట్టించారు ? అనే అంశాలపై వాస్తవాలను బయటపెట్టకపోవడం కాంగ్రెస్ ముఖ్యమంత్రితో మీకున్న లోపాయికారి ఒప్పందాలను బట్టబయలు చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. అన్ని టన్నుల బొగ్గు ఏమయిందో వెంటనే విచారణ జరిపించి నిజానిజాలేంటో తేల్చి.. బీజేపీ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని లేఖ ద్వారా డిమాండ్ చేశారు. ఈ కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. సింగరేణి సంస్థను కోలుకోని విధంగా దెబ్బతీసే ఈ



కుంభకోణంపై ఒకవేళ విచారణ జరపకపోతే కార్మికలోకంతో కలిసి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలపై బీఆర్ఎస్ పార్టీ జంగ్ సైరన్ మోగిస్తుందని హెచ్చరించారు.

# భారత్ దూకుడు.. జీడీపీ వృద్ధిరేటు పెరగడంపై మోడీ హర్షం..

ప్రపంచమంతా సంక్షోభంలో ఉండగా భారత్ మాత్రం ఆర్థికంగా దూసుకుపోతుంది. ఇందుకు 2025–26 ఆర్థిక సంవత్సరంలో దేశ జీడీపీ వృద్ధిరేటు 7.7 శాతంగా నమోదు కావడమే ఉదాహరణ. ఇదే అంశంపై ఎక్స్ వేదికగా ప్రధాని మోడీ హర్షం వ్యక్తం చేశారు. భారత ఆర్థిక వ్యవస్థ బలంగా ముందుకు సాగుతోందని వ్యాఖ్యానించారు. ఇది భారత ఆర్థిక వ్యవస్థలోని అంతర్గత బలాన్ని, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల విజయాన్ని, 140 కోట్ల భారతీయుల కష్టానికి నిదర్శనమని పేర్కొన్నారు.

సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో స్పందించిన ప్రధాని మోడీ.. "భారత్ వృద్ధి వేగం బలంగా కొనసాగుతోంది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో 7.7 శాతం జీడీపీ వృద్ధి, అదే ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి నమోదవడం దేశ ఆర్థిక శక్తిని ప్రతిబింబిస్తోంది" అని అన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, వ్యాపారాలకు అనుకూల వాతావరణం కల్పించడం కోసం ప్రభుత్వం మరింత కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. 'ఈజ్ ఆఫ్ లివింగ్', 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' లక్ష్యాలతో సంస్కరణలను కొనసాగిస్తామని తెలిపారు.

**7.7 శాతానికి చేరిన జీడీపీ**

గణాంకాల మంత్రిత్వ శాఖ జూన్ 5న విడుదల చేసిన అధికారిక గణాంకాల ప్రకారం.. 2025–26 ఆర్థిక సంవత్సరంలో భారత ఆర్థిక వ్యవస్థ 7.7 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది రెండో అడ్వాన్స్ అంచనాల్లో పేర్కొన్న 7.6 శాతం కంటే ఎక్కువ. కాగా 2024–25 ఆర్థిక సంవత్సరంలో దేశ వాస్తవ జీడీపీ వృద్ధి 7.1 శాతంగా నమోదైంది.

**నాలుగో త్రైమాసికంలో 7.8% వృద్ధి**

2025–26 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం లో జీడీపీ వృద్ధిరేటు 7.8 శాతంగా నమోదైంది. అయితే ఇది మూడో త్రైమాసికం లో నమోదైన 8 శాతం వృద్ధి కంటే స్వల్పంగా



తక్కువ. తయారీ రంగం (మాన్యుఫాక్చరింగ్) వృద్ధి 12.8 శాతం నుంచి 7.3 శాతానికి తగ్గడం వల్ల త్రైమాసిక వృద్ధిలో కొంత మందగమనం కనిపించినట్లు గణాంకాలు వెల్లడించాయి. అయినప్పటికీ ప్రధాన ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా కొనసాగుతోందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**సంజయ్ మల్హోత్రా..**

భారత ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా కూడా అన్నారు. ఒక కార్యక్రమంలో సంజయ్ మల్హోత్రా మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితులు, అంతర్జాతీయ సంక్షోభాలు కొనసాగుతున్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం బలంగా ఉందని తెలిపారు. దేశ ఆర్థిక పరిస్థితి ప్రస్తుతం ఎంతో స్థిరంగా.. ఆరోగ్యకరంగా ఉందని స్పష్టం చేశారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లు భారత్‌కు మాత్రమే పరిమితం కావని.. అన్ని దేశాలు ఈ ప్రభావాన్ని ఎదుర్కొంటున్నాయని తెలిపారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో భారత్ ఇతర దేశాలతో పోలిస్తే మెరుగైన స్థితిలో ఉందని.. గతంలో ఎదుర్కొన్న ఇలాంటి ఆర్థిక షాక్‌లతో పోల్చినా దేశం మరింత బలంగా నిలిచిందని చెప్పుకొచ్చారు.

# లాసెట్‌లో మావోయిస్టు మాజీ అగ్రనేత దేవ్‌జీకి 349వ ర్యాంకు



మావోయిస్టు మాజీ అగ్రనేత తిప్పిరి తిరుపతి(దేవ్‌జీ) ఐదేళ్ల న్యాయ విద్య కోర్సు ప్రవేశ పరీక్షలో 349వ ర్యాంకు సాధించారు. గురువారం లాసెట్ ఫలితాలు విడుదల కాగా.. దేవ్‌జీ 57 మార్కులు సాధించి ఈ ర్యాంకును కైవసం చేసుకున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి చివర్లో ఆయన లొంగిపోయిన విషయం తెలిసిందే. 1980–82లో కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్(ఎంపీసీ) చదివారు. ఓ సబ్జెక్టు మిగిలిపోవడంతో.. ఇంటర్ బోర్డు నుంచి ప్రత్యేక అనుమతి పొంది మే 13న ఇంటర్ ద్వితీయ సంవత్సరం తెలుగు పరీక్ష రాశారు. ఫలితాలు ఇంకా విడుదల కాలేదు. న్యాయ విద్య చదవాలనే కోరికతో ప్రవేశ పరీక్ష రాసి అర్హత సాధించారు.

ఇది కద నిజం
శనివారం 06-06-2026

# పర్యావరణ పరిరక్షణకై టీడీపీ నేత వినూత్న ప్రచారం

– సైకిల్‌పై వెళ్లి మొక్కలు నాటిన మాజీ ఉప సర్పంచ్ పిచ్చుక రాజు



**ఇది కద నిజం, కుక్కునూరు:**
ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని (మే 5) పురస్కరించుకొని కుక్కునూరు మేజర్ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ పిచ్చుక రాజు సమాజానికి ఒక గొప్ప సందేశాన్ని ఇచ్చారు. కాలుష్య రహిత సమాజ స్థాపనే ధ్యేయంగా ఆయన శుక్రవారం వినూత్న రీతిలో పర్యావరణ పరిరక్షణ ప్రచారాన్ని చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపు మేరకు ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందనే అవగాహన కల్పించేందుకు ఈ టీడీపీ నేత స్వయంగా సైకిల్‌పై ప్రయాణించి, పలు ప్రాంతాలలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా పిచ్చుక రాజు మాట్లాడుతూ... పెరుగుతున్న కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్ విపత్తుల నుండి భూమిని కాపాడుకోవడానికి విస్తృతంగా మొక్కలు నాటడమే ఏకైక మార్గమని పిలుపునిచ్చారు. అలాగే, ఇంధన పొదుపు, శారీరక దారుఢ్యం కోసం ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో సైకిల్ వాడకాన్ని అలవాటు చేసుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఒక ప్రజాప్రతినిధిగా ఆయన చేసిన ఈ వినూత్న ప్రయత్నాన్ని, సామాజిక స్పృహను స్థానిక ప్రజలు, పర్యావరణ ప్రేమికులు ఎంతగానో అభినందిస్తున్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

- కుక్కునూరు మండల టీడీపీ అధ్యక్షుడు ములిశెట్టి నాగు



**ఇది కద నిజం, కుక్కునూరు:**
పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ స్వతహాగా ముందుకు రావాలని కుక్కునూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ములిశెట్టి నాగు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం ఆయన ప్రత్యేక సైకిల్ యాత్ర చేపట్టారు. తన నివాసం నుండి సైకిల్‌పై బయలుదేరిన ములిశెట్టి నాగు.. కివ్వాక గ్రామ పంచాయతీ పరిధిలోని తెల్లారాయిగూడెం ఆర్ అండ్ ఆర్ కాలనీకి చేరుకుని అటవీ శాఖ అధికారులు నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మండల అధికారులుతో కలిసి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాగు మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, వాటి సంరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అలాగే, పర్యావరణ సమతుల్యత వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ ర్యాలీ ప్రధాన ఉద్దేశం అని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న హరిత ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ములిశెట్టి నాగు పిలుపునిచ్చారు.

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కుక్కునూరు ఫారెస్ట్ రేంజ్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో పలు శాఖల మండల స్థాయి అధికారులు, నాయకులు, ప్రజలు ఉత్సహంగా పాల్గొన్నారు.

# నెహ్రూ జూ పార్క్‌లో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

## మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్



**ఇది కద నిజం,హైదరాబాద్:**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' ఉత్సవాలలో భాగంగా హైదరాబాద్‌లోని నెహ్రూ జంతు ప్రదర్శనశాల (జూ పార్క్)లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌ను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బహదూర్‌పురా నియోజకవర్గం శాసనసభ్యులు మహ్మద్ ముబీన్, జూ పార్క్ క్యూరేటర్ జె. వసంత, ఐఎఫ్ఎస్‌తో కలిసి పశుగ్రాస ప్రాంతంలో మొక్కలు నాటి ఈ డ్రైవ్‌ను అధికారికంగా ప్రారంభించారు. అనంతరం రామనాథపుర కార్పొరేటర్ మహ్మద్ ఖాదర్‌తో కలిసి ఎమ్మెల్యే జూ పార్క్‌లోని ప్రైమేట్ పార్క్, ఏనుగుల ఆవరణ, సఫారీ పార్క్ కాంప్లెక్స్, ఖడ్గమృగాల ఆవరణ, సరీసృపాల గృహం మరియు నిశాచర జంతువుల గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ మాట్లాడుతూ ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడంలో నెహ్రూ జూ పార్క్ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని కొనియాడారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యతని, 'ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం పౌరుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న అద్భుతమైన చర్యలకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. జూ పార్క్ క్యూరేటర్ శ్రీమతి జె. వసంత మాట్లాడుతూ.. ప్రజల్లో చైతన్యం తేవడానికే ప్రతి ఏటా జూన్ 5న పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకుంటామని, ఇందులో భాగంగా ఈరోజు జూ పార్కులో 200కు పైగా మొక్కలు నాటామని, రాబోయే రోజుల్లో ఈ పెంపకాన్ని మరింత ముమ్మరం చేస్తామని తెలిపారు. ఈ మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో జూ పార్క్ డిప్యూటీ క్యూరేటర్ శ్రీ జె. మురళీధర్, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎ. హకీమ్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ క్యూరేటర్లు నజియా తబస్సుమ్, బి. లక్ష్మణ్, పీఆర్వో హెచ్.ఎం. హనీఫుల్లా మరియు ఇతర ఉన్నతాధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని మొక్కలు నాటారు.

# కుత్బుల్లాపూర్‌లో ఘనంగా 'ఏక్ పెడ్ మా కే నామ్' వృక్షారోపణ కార్యక్రమం






**ఇది కద నిజం,కుత్బుల్లాపూర్:**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న విజయోత్సవ సందర్భాన్ని, అలాగే ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ పరిధిలోని పాటిగడ్డ రుక్మిణి ఎస్టేట్స్ పార్క్ (286 డివిజన్)లో "ఏక్ పెడ్ మా కే నామ్" (ఒక మొక్క అమ్మ పేరుతో) వృక్షారోపణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బీజేపీ జాతీయ, రాష్ట్ర నాయకత్వాల సూచనల మేరకు బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి నల్ల జై శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ హరిత కార్యక్రమం జరిగింది. మోదీ 12 ఏళ్ల సుపరిపాలన శరవేగంగా దూసుకుపోతున్న తరుణంలో, పర్యావరణ పరిరక్షణకు మొక్కలే ఏకైక మార్గమని నల్ల జై శంకర్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన నేతృత్వంలో కాలనీ ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని రుక్మిణి ఎస్టేట్స్ పార్క్‌లో మొక్కలు నాటారు. వచ్చే తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన మరియు హరిత వాతావరణాన్ని బహుమతిగా అందించాలనే సంకల్పంతో ప్రతి ఒక్కరూ బాధ్యతగా కనీసం ఒక మొక్కనైనా నాటి, దానిని సంరక్షించాలని ఈ సందర్భంగా నల్ల జై శంకర్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు పులి బలరాం, నాగరాజ్ గౌడ్ తదితరులు పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తమ వంతు మద్దతును చాటారు.

# మీరాలం మండీ మహాంకాళేశ్వరీ అమ్మవారికి ఘనంగా మహాఅభిషేకం



**ఇది కద నిజం, చార్మినార్, జూన్ 5:**
అధిక మాసం (పురుషోత్తమ మాసం) సందర్భాన్ని పురస్కరించుకుని మీరాలం మండీలోని శ్రీ మహాంకాళేశ్వరీ దేవాలయంలో లోక కల్యాణార్థం శుక్రవారం నాడు ప్రత్యేక పూజా కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ పవిత్ర కాలంలో లోక కల్యాణం కోసం అమ్మవారికి అభిషేకాలు నిర్వహించాలని దేవ బ్రహ్మణులు సూచించడంతో, ఈ మహాఅభిషేకాన్ని మరియు ప్రత్యేక పూజలను ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్వాహకులు గాజుల అంజయ్య తెలిపారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి నిత్య మాంగళ్య పూజలు, 108 కలశాలు మరియు పంచామృతాలతో మహాభిషేక కార్యక్రమాన్ని వైభవంగా జరిపారు. చాముండేశ్వరి గురుదత్త పీఠం పండితులు కొడకండ్ల శరణ్ శ్రీరామ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు ఈ మహాభిషేక తంతును శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ విశేష పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

# అమీర్ పేట్ అగ్నిప్రమాదానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

**ప్రమాదంలో ఆస్తి నష్టపోయిన వారికి పరిహారం ఇవ్వాలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత బాధితులకు పరామర్శ, అండగా ఉంటామని భరోసా**





**ఇది కద నిజం,హైదరాబాద్:**
అమీర్ పేట్ లో జరిగిన అగ్నిప్రమాదానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. శుక్రవారం అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని ఆమె పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందో బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులు చెబుతున్న వివరాల ప్రకారం ఈ ప్రమాదం అనుకోకుండా జరిగింది కాదని తెలుస్తోందని కవిత అన్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతం వెనుకల ఉన్నమెస్ కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని బాధితులు చెబుతున్న విషయాన్ని ప్రస్తావించారు. గతంలో ఇక్కడ షార్ట్ సర్క్యూట్ జరిగిందని దానిపై మూడు నెలల క్రితమే స్థానికులు ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోలేదన్నారు. అప్పుడే సరైన చర్యలు తీసుకోని ఉంటే ప్రమాదం జరిగేది కాదన్నారు. ప్రమాదంలో దాదాపు 4 కోట్లు ఆస్తినష్టం జరిగిందన్నారు. ఆస్తినష్టం పై సరైన అంచనా వేసి బాధితులందరికీ నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదం జరిగిన గంటంబావు వరకు కూడా ఫైరింజన్లు రాకపోవడం అత్యంత దారుణమని, సరైన సమయానికి అగ్నిమాపక సిబ్బంది వచ్చి ఉంటే నష్టం చాలా వరకు తగ్గేదన్నారు. అదృష్టవశాత్తు ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని...కానీ మళ్లీ ఇలాంటి సంఘటనలు జరిగితే పెద్ద ఎత్తున నష్టం జరిగే ప్రమాదం ఉంటుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇలాంటి సంఘటనలపై సీరియస్ గా దృష్టి పెట్టాలని సూచించారు.

# జనసేనలో సంస్థాగత పునర్వ్యవస్థీకరణ..




**ఇది కద నిజం:**
ఆంధ్రప్రదేశ్ అధికార పక్షంలో కీలక భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీలో భారీ సంస్థాగత పునర్వ్యవస్థీకరణకు అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శ్రీకారం చుట్టారు. కేడర్ ఆధారిత బలమైన నాయకత్వ వ్యవస్థను నిర్మించడమే లక్ష్యంగా, రాష్ట్రవ్యాప్తంగా 'నిర్మాణ సమాచార సేకరణ కమిటీల'ను ఆయన నియమించారు. కేవలం ఎన్నికల విజయాలకే పరిమితం కాకుండా, దీర్ఘకాలిక రాజకీయ ప్రయోజనాల కోసం పార్టీని క్షేత్రస్థాయి నుంచి పటిష్ఠం చేసే వ్యూహాత్మక అడుగుగా దీనిని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**భవిష్యత్ నాయకత్వమే లక్ష్యం..**

రాష్ట్రంలోని 25 పార్లమెంట్, 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీని క్షేత్రస్థాయి నుండి పునర్నిర్మించేందుకు ఈ కసరత్తు మొదలైంది. నిన్నటివరకు సాధారణ కార్యకర్తలుగా, జనసైనికులుగా ఉన్న వారి నుంచే భవిష్యత్తు రాజకీయ నాయకత్వాన్ని తీర్చిదిద్దే ఒక వినూత్న ప్రక్రియకు పవన్ కళ్యాణ్ రూపకల్పన చేశారు. పార్టీ కోసం మొదటి నుంచి అంకితభావంతో, నిరూపితమైన సేవలందించిన ప్రతి ఒక్కరినీ గుర్తించేందుకు ఈ ప్రత్యేక కమిటీలు పనిచేస్తాయి.

**పకడ్బందీగా కమిటీల కూర్పు..**

సంస్థాగత మార్పుల్లో భాగంగా ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి 28 మంది సభ్యులతో కూడిన ఒక జంబో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీల్లో ఒక పరిశీలకుడు, సీనియర్ నాయకులు, క్రియాశీలక సాధకులతో పాటు 'వీరమహిళల'కు సైతం సరైన గుర్తింపు, తగిన ప్రాధాన్యత కల్పించారు. ఈ కమిటీల కూర్పుకు సంబంధించిన ప్రతి అంశాన్ని పవన్ కళ్యాణ్ స్వయంగా సమీక్షించి ఆమోదముద్ర వేయడం విశేషం. దశాబ్దన్నర క్రితమే పవన్ మనసులో రూపుదిద్దుకున్న రాజకీయ ఆలోచనలకు, ఆశయాలకు కార్యరూపమే ఈ నియామకాలు.

**అర్హులకే పదవులు.. పవన్ కళ్యాణ్ తుది నిర్ణయం..**

ఈ కమిటీలు క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తల పనితీరు, వారి నాయకత్వ లక్షణాలు, అంకితభావంపై సమగ్రంగా అధ్యయనం చేసి ఒక నివేదికను రూపొందిస్తాయి. ఈ క్షేత్రస్థాయి సమాచారాన్ని, సేకరించిన నివేదికలను పూర్తిగా పరిశీలించిన తర్వాతే పార్టీలో వివిధ బాధ్యతల కేటాయింపులు జరుగుతాయి. అర్హత, కష్టపడే తత్వమే ప్రామాణికంగా సాగే ఈ ప్రక్రియలో తుది నిర్ణయం పూర్తిగా పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ చేతుల్లోనే ఉంటుంది. కష్టపడిన ప్రతి జనసైనికుడికి సముచిత గుర్తింపు కల్పించడమే ఈ భారీ రాజకీయ కసరత్తు ముఖ్య ఉద్దేశం.

# ఇద్దరు పిల్లలు మృతి




**ఇది కద నిజం:**
కామారెడ్డి జిల్లా బోల్లక్ పల్లి మంజీర బ్రిడ్జ్ వద్ద ఉన్న ఎల్లమ్మ గుడి దగ్గర మొక్కులు తీర్చుకునేందుకు వచ్చి మంజీరా నది లోకి వెళ్లి కాళ్లు చేతులు శుభ్రం చేసుకునే సమయంలో ప్రమాదవశాత్తు నీటిలోపడి మునిగి లింగంపేట్ మండలం పరిమల గ్రామానికి చెందిన అనిత 38 శివాని 13 మృతి చెందగా భాను ప్రసాద్ 13 ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు పిట్లం మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన బాలిక పావని 15 సైతం నీటిలో మునిగి మృతి చెందగా వీరి మృతదేహాలను బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు ప్రస్తుతం బాలుడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు

# ఏఐ సాంకేతికతతో చిన్నారుల వికాస గుర్తింపు



**నెల్లూరు జిల్లా సైదాపురం (ఇది కద నిజం):**
నెల్లూరు జిల్లా సైదాపురం మండల కేంద్రంలోని డాక్టర్ సి.ఆర్.ఆర్. కళాశాలలో మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు (ఏఐ) ఆధారిత ప్రత్యేక శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమం రెండు రోజుల పాటు కొనసాగుతుందని, శనివారం మరో సెక్టార్‌కు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ అందించనున్నట్లు సూపర్వైజర్ కె ధనమ్మ, తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ప్రవీణ్, సూపర్వైజర్ ఎస్ కే ఫాతిమా,అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



# సినిమా న్యూస్

## పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో సాయి పల్లవి!





టాలీవుడ్, కోలీవుడ్ ప్రేక్షకుల అభిమాన హీరోయిన్ సాయి పల్లవి ప్రస్తుతం కెరీర్ పరంగా ఫుల్ జోష్‌లో ఉన్నారు. గత ఏడాది 'తండేల్' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న సాయి పల్లవి ఇప్పుడు క్రేజీ ప్రాజెక్ట్స్'ను లైన్‌లో పెడుతున్నారు. బాలీవుడ్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 'రామాయణ'లో సీత పాత్రలో నటిస్తోంది ఈ ముద్దుగుమ్మ. అంతేకాకుండా కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ కెరీర్‌లో 'డి-55'గా రాబోతున్న చిత్రంలోనూ కీలక పాత్రలో నటించనుంది. ఈ మూవీకి 'అమరన్' తో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న డైరెక్టర్ రాజ్ కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్నారు. సాయి పల్లవికి ఈ దర్శకుడితో ఇది రెండో సినిమా కావడం విశేషం. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో సాయి పల్లవితో పాటు టాలెంటెడ్ బ్యూటీ శ్రీలీల, వర్సటైల్ యాక్టర్ ఎస్ జే కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను ధనుష్‌కు చెందిన వండర్ బార్ ఫిల్మ్స్, ఆర్ టేక్ స్టూడియోస్ సంస్థలు సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి.

ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు గ్రాండ్‌గా పూర్తి కాగా, షూటింగ్ కూడా శరవేగంగా ప్రారంభమైంది. ఈక్రమంలో.. తాజాగా, ఈ సినిమాకు సంబంధించి ఒక ఆసక్తికరమైన వార్త తెగ వైరల్ అవుతోంది. ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామాలో సాయి పల్లవి మొట్టమొదటి సారి ఒక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటించబోతున్నట్లు సమాచారం. ఇప్పటివరకు హోమ్లీ, ఎమోషనల్ పాత్రల్లో మెప్పించిన సాయి పల్లవి, తొలిసారి ఖాకీ దుస్తులు ధరించి యాక్షన్ సీన్స్‌లో కనిపించనుండటంతో అభిమానుల్లో ఒక్కసారిగా హైప్ క్రియేట్ అయింది. కాగా..ధనుష్-సాయి పల్లవి కాంబినేషన్‌లో గతంలో వచ్చిన 'మారి-2' లోని 'రౌడీ బేబీ' సాంగ్ ఎంతటి సంచలనం సృష్టించిందో అందరికీ తెలిసిందే. మళ్లీ వీరిద్దరి కాంబోలో, అది కూడా రాజ్ కుమార్ పెరియసామి దర్శకత్వంలో సినిమా వస్తుండటంతో పాటు పోలీస్‌గా సాయి పల్లవి నటిస్తుండటంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

## 'పెద్ది' మూవీకి ఎదురుదెబ్బ

### ఆన్‌లైన్‌లో HD ప్రింట్ ప్రత్యక్షం




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా భారీ అంచనాలతో థియేటర్లలోకి వచ్చిన 'పెద్ది' మూవీ మిక్స్‌డ్ టాక్‌తో వసూళ్ల ప్రభంజనం సృష్టిస్తోంది. ఈ క్రమంలోనే విడుదలైన రెండో రోజే ఈ సినిమాను సైతం పైరసీ భూతం వదల్లేదు.

ఆన్‌లైన్‌లో హై క్వాలిటీ ప్రింట్లు

అయితే, సాధారణంగా సినిమాలు విడుదలైన కొత్తలో క్యామ్ రికార్డింగ్ ద్వారా వస్తుంటాయి. కానీ 'పెద్ది' సినిమాకు సంబంధించి ఆన్‌లైన్‌లో ఏకంగా హైక్వాలిటీ ప్రింట్లు అందుబాటులోకి రావడం చిత్ర పరిశ్రమను సైతం విస్మయానికి గురిచేస్తోంది. దీంతో ఈ చిత్రం డిజిటల్ వసూళ్లపై ఎక్కడ ప్రభావం పడుతుందోనని మెగా అభిమానులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పైరసీ లింకులు సోషల్ మీడియా లో విచ్చలవిడిగా షేర్ అవుతుండటాన్ని గమనించిన మెగా ఫ్యాన్స్ వెంటనే అప్రమత్తమయ్యారు. ఆయా పైరసీ లింకులను వెంటనే ఇంటర్నెట్ నుంచి తొలగించేలా యాంటీ పైరసీ విభాగానికి సమాచారం ఇస్తున్నారు. అంతేకాకుండా, అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిన ఈ చిత్రం లింకులను లీక్ చేసి, పైరసీకి పాల్పడిన నిందితులపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని మూవీ టీమ్, పోలీసు యంత్రాంగాన్ని సోషల్ మీడియా వేదికగా కోరుతున్నారు.

## నిర్మాతగా నా ప్రయాణం స్టార్ట్



వరుస పరాజయాలతో సతమతమవుతున్న టైమ్‌లో 'దూత' వెబ్ సిరీస్‌తో ఓటీటీ ఎంట్రీ ఇచ్చి సాలిడ్ హిట్ అందుకున్నాడు అక్కినేని హీరో నాగచైతన్య. 2023 డిసెంబర్ 1న అమెజాన్ ప్రైమ్ వీడియోస్‌లో విడుదలై పలు రికార్డులు సొంతం చేసుకున్న ఈ సిరీస్‌కు ఇప్పుడు సీక్వెల్‌గా 'దూత 2' రాబోతున్నది. తాజాగా దీనికి సంబంధించిన పూజాకార్యక్రమాలు గ్రాండ్‌గా జరగగా.. అక్కినేని నాగార్జున క్లాప్ కొట్టి దీన్ని ప్రారంభించారు. ఇందులో మరో విశేషం ఏంటంటే.. ఈ దూత 2తో నాగచైతన్య నిర్మాతగా మారుతున్నట్లు ప్రకటించాడు. ఈ మేరకు పూజాకార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలను తన సోషల్ మీడియా అకౌంట్ ఎక్స్ వేదికగా పంచుకుంటూ.. ''దూత' రెండవ అధ్యాయంలోకి అడుగుపెడుతూ, నిర్మాతగా నా ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న ఈ శుభ తరుణంలో.. ఇకపై అంతా ఉన్నతమైన పురోగతే.. ముందున్న అద్భుతమైన ప్రయాణానికి స్వాగతం' అంటూ చెప్పుకొచాడు. కాగా.. విక్రమ్ కె. కుమార్ దర్శకత్వంలో రూపొందిన హారర్ మిస్టరీ థ్రిల్లర్ 'దూత'లో నాగచైతన్య జర్నలిస్ట్ సాగర్ వర్మ అవధూరిగా అందరిని ఆకట్టుకున్నాడు. దీంతో సాగర్ వర్మ మళ్లీ వచ్చేస్తున్నాడు అంటూ అనౌన్స్‌మెంట్ ఇచ్చిన ఫొటోస్ ప్రస్తుతం వైరల్ అవుతూ అందరిని దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

## ఆ సినిమా చేయడానికి కారణం ఒక్క ఫోటోనే



సీనియర్ నటి ప్రియమణి ఇప్పటివరకు తెలుగుతో పాటు పలు భాషా చిత్రాల్లో నటించి, ఇండియా వ్యాప్తంగా మంచి గుర్తింపును సంపాదించుకుంది. కొంతకాలం క్రితం ఆమె విక్టరీ వెంకటేష్ హీరోగా, శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో రూపొందిన 'నారప్ప' చిత్రంలో హీరోయిన్‌గా నటించింది. సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సురేష్ బాబు నిర్మించిన ఈ చిత్రం నేరుగా ఓటీటీలో విడుదలై మంచి ప్రేక్షకాదరణ పొందింది. తాజాగా ప్రియమణి ఓ ఇంటర్వ్యూలో ఈ సినిమా గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది.

ఆమె మాట్లాడుతూ... చాలా కాలం క్రితం రామానాయుడు స్టూడియోలో షూటింగ్ జరుగుతున్న సమయంలో అక్కడ కొంతమంది నటీమణుల ఫోటోలను చూశానని, అప్పట్లో వాటి గురించి తనకు పెద్దగా తెలియదని చెప్పింది. తర్వాత అవి సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో నటించిన హీరోయిన్ల ఫోటోలు అని తెలిసిందని తెలిపింది. దాంతో అక్కడ తన ఫోటో కూడా ఉండాలని అప్పుడే అనుకున్నానని పేర్కొంది.

ఆ తర్వాత కొన్ని సంవత్సరాలకు సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో 'నారప్ప' చిత్రంలో నటించే అవకాశం వచ్చిందని, ఆ సినిమాలో తన నటనకు మంచి గుర్తింపు లభించిందని చెప్పింది. అలాగే సురేష్ ప్రొడక్షన్స్‌లో పనిచేయాలనే కోరిక కూడా నెరవేరిందని తెలిపింది. శ్రీకాంత్ అడ్డాల ఒక అద్భుతమైన దర్శకుడని, 'నారప్ప' చిత్రాన్ని చాలా గొప్పగా తెరకెక్కించారని ప్రశంసించింది. చివరగా రామానాయుడు స్టూడియోలో తన ఫోటో ఉండాలనే కోరిక 'నారప్ప' సినిమాతో నెరవేరిందని ప్రియమణి పేర్కొంది.